క్లుప్తంగా

కార్మెల్‌మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదోని, ద్రోణాదుల, కర్నూలు ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు రైలు, వాహనాల ద్వారా ఉదయాన్నే ఇక్కడకు వచ్చారు. కొండను ఎక్కి కార్మెల్ మాతను దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం బాల ఏసుదేవాలయంలో నిర్వహించిన దివ్యపూజ బలి పూజల్లో పాల్గొన్నారు. వారికి దేవాలయ విచారణ గురువులు ఆశీర్వచనాలు అందజేశారు.

ఘనంగా విజ్ఞాన విహార వార్షికోత్సవం



మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి విజ్ఞాన విహార ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రతినిధి మలకపాటి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థి వల్లూరి ప్రజ్ఞ, పాఠశాల చైర్మన్ రఘురామిరెడ్డి, కోశాధికారి ఆదిశేషావతారం, ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెనిగళ్ల సురేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఫిరంగిపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని గుండాలపాడులో పార్టీ మండల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కోశాధికారి రామకోటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గొర్రెపాటి చంద్రశేఖరరావు, శివారెడ్డి, విశ్వనాథరెడ్డి, వి.హరిబాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

మంగళగిరి: నగరంలోని పార్కు రోడ్డు ఇమ్మానుయేలు చర్చి ఆవరణలో ఆదివారం పాస్టర్ బొంతపురి రవి ప్రకాష్, పలువురు వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగోతు సామ్రాజ్యమ్మ, నన్నపనేని విమలమ్మ, గూడపాటి సునీల్, మైలవరపు ప్రశాంత్‌బాబు, బండి దేవరాజు, పాపాబత్తుల మరియమ్మ, అత్యాల అలీసమ్మ, మునివాణి, ఆనంద్ జాన్సన్, రెంటపాళ్ల సతీష్, గడ్డం లావణ్య పాల్గొన్నారు.

కేఎల్‌యూ అధ్యాపకుడు సతీష్‌బాబుకు డాక్టరేట్

మంగళగిరి: కేఎల్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆచార్య జంపని సతీష్‌బాబుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల విభాగం అధిపతి ఎఎస్‌సీఎస్ శాస్త్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, వ్యక్తిగత గోప్యత, ఆన్‌లైన్ మోసాలు, విద్యుత్ చౌర్యం వంటి నేరాలను పసిగట్టి నిరోధించేందుకు జంపని సతీష్ బాబు నూతన టెక్నాలజీని రూపకల్పన చేసినందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు చెప్పారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

హరిశ్చంద్రాపురం(తాడికొండ): తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం గ్రామ శివారు కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం కొట్టుకు వచ్చినట్లు తుళ్లూరు ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు. 40–45 సంవత్సరాల వయసు మహిళగా గుర్తించారు. గుర్తుపట్టలేనట్లు 10 రోజుల క్రితం లాగా ఆనవాళ్ళు ఉన్నట్లు వివరించారు. వీఆర్వో ఆకుల బాజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

చిలువూరు(మంగళగిరి): ముగ్గురు రాజుల పండుగ సందర్భంగా చిలువూరు ఆర్‌సీఎం స్కూల్ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వైజ్ఞానిక విప్లవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగాయి. కబడ్డీ పోటీలను మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ దాసరి అరుణ, ఎంపీటీసీ మరియ రోజమ్మ, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ కట్టెపోగు బసవరాజు, రాష్ట్ర మానవ హక్కుల సంఘం నాన్ జుడీషయల్ మెంబర్ గోశపాతు శ్రీనివాసరావు, మల్లవరపు నాగయ్య పాల్గొన్నారు.

ఆనందమంటే ఇదే కదా!



1994-97 బ్యాచ్ బీకాం విద్యార్థులు



1984- 85 టెన్త్ విద్యార్థుల గ్రూపు ఫొటో

పాత సంవత్సరాలు పోతాయి.. కొత్త సంవత్సరాలు వస్తాయి.. మన కల మనకు తెలుసు.. మన కలకి మనం తెలుసు.. ఓనమాలు దిద్దడం దగ్గర నుంచి అక్షరం రూపంగా మారే వరకు మనం పోరాటం కొనసాగుతోంది.. ఎన్నో కలలను సాకారం చేసుకునే కేంద్రంగా బడి నిలిచింది. ఆ బడికి చేరుకోగానే కనుపాపల్లో ఆనంద జ్యోతులు వెలిగాయి. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు చలించిపోయాయి. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. ఈ అపూర్వ ఘట్టాలకు మంగళగిరి వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల, కనకయ్య బాలికల ఉన్నత పాఠశాల వేదికగా నిలిచాయి.

మంగళగిరి: నగర పరిధిలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల 1994–97 బీకాం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసి జ్ఞాపికలను ప్రదానం చేశారు. కళాశాలలో విద్యనభ్యసించి హైకోర్టు ఆర్బిటరేటర్‌గా ఇటీవల డీన్‌గా నియమితులైన డీవీ నరసింహంను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఇసునూరి చందు, తాతారావు ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గోలి రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ అందె రామ్మోహనరావు, విశ్రాంత అధ్యాపకులు బెంజిమన్ ఫ్రాంక్లిన్, రాజశేఖరబాబు, నాగేశ్వరశాస్త్రి, నాగేశ్వర శర్మ, ఏటీ రాయుడు, నిర్మల కుమారి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కనకయ్య బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు..

చింతక్రింది కనకయ్య బాలికల ఉన్నత పాఠశాల 1984–85లో 10వ తరగతి పూర్వ విద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. స్థానిక కళఋణ మండపంలో నిర్వహించిన సమ్మేళనానికి 80 మంది పూర్వ విద్యార్థినులు హాజరై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు రమాదేవి, స్వర్ణలత, సత్యారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు వి.తనూజ, కె.కృష్ణప్రియ, ఆర్.సుధారాణి, కె.మంజుల, టి.జానకి, కె.ఉమామహేశ్వరి, మణిభూషిణి, పాఠశాల సెక్రటరీ పాండు రంగారావు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థినుల కూచిపూడి నృత్యం



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరత మాత పూజ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థినుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా వందేమాతరం రాత పోటీలు, రంగోలి పోటీలు, కూచిపూడి బృంద నృత్యాలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్ బాబు పర్యవేక్షించారు.

శ్రీ సీతారామస్వామి దేవస్థానం చైర్మన్‌గా వెంకట్రావు



కొరిటెపాడు(గుంటూరు): ఏటుకూరు రోడ్డులోని డీఎస్‌నగర్‌లో గల శ్రీ సీతారామ స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా యేసుగంటి వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు ముప్పాళ్ల శ్రీనివాసరావు(వాసు), కట్టా ఏడుకొండలు, యాగంటి పోలయ్య, యేసుగంటి ముని అభినందనలు తెలిపారు.

వైభవంగా రామానుజాచార్యుల పుష్పాలంకరణ



స్వామివారికి ఊరేగింపుగా పుష్పాలు తీసుకెళుతున్న భక్తులు

తెనాలిటౌన్: పట్టణ వీఎస్‌ఆర్ కాలేజ్ రోడ్డు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీ రామానుజదాస స్వామి పర్యవేక్షణలో శరణాగతి గోష్ఠి వారి ఆధ్వర్యంలో భగవత్ రామానుజాచార్యుల వారికి విశేష పూజలు జరిగాయి. ఆదివారం స్వామివారికి పలు రకాల పుష్పాలతో పూజలు చేశారు. భక్తులు పుష్పాలను బుట్టల్లో తీసుకువచ్చారు. స్వామివారికి రథంపై ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ చందు రామారావు, పలువురు ప్రముఖులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న చేకూరి రాజశేఖర్

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో వినియోగదారుల రక్షణ చట్టం– 2019 ఆవశ్యకత గురించి విస్తృతంగా ప్రచారం చేస్తామని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేకూరి రాజశేఖర్ తెలిపారు. గుంటూరులోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో తూనికలు, కొలతలు, నాసిరకం మందులు, బంగారు ఆభరణాల హాల్ మార్కింగ్‌ల చైతన్య సమాచారంతో కూడిన వినియోగదారుల హక్కుల ప్రచార రథాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిలలో పూర్తిస్థాయి వినియోగదారుల కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు చదలవాడ హరిబాబు, సీహెచ్. చక్రపాణి, సీనియర్ న్యాయవాది ఆర్.ఆనందరావు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మంగళగిరి: నార్త్ సబ్ డివిజన్ పరిధిలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జె.రాంబాబు హెచ్చరించారు. ఆదివారం పలు స్టేషన్ల వద్ద జూదరులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, భూదందాలు, సెటిల్‌మెంట్లలో పాల్గొంటే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఆయా స్టేషన్ల వద్ద సీఐలు అంకమ్మరావు, భూషణం, శేషగిరిరావు పాల్గొన్నారు.

జగ్గారపు సుబ్బారావుకు ఘన నివాళి



మంగళగిరి: ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ జగ్గారపు సుబ్బారావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. నగర పరిధిలోని రత్నాలచెరువులో సుబ్బారావు సంస్మరణ సభ నిర్వహించిన నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొర్రపాటి ఆదినారాయణ, కూరపాటి కోటేశ్వరరావు, గుర్రం విజయ్‌కుమార్, విజయ్‌కిషోర్‌బాబు, ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, కంచర్ల కాశయ్య, జేవీ రాఘవులు, మేకల ప్రసాద్ పాల్గొన్నారు.

లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు జిల్లా తెనాలిలోని మారీసు పేటకు చెందిన మీసాల సాయిచరణ్‌తేజ్ (26)మొబైల్ ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయనకు సంవత్సరం క్రితం వివాహమైంది. శనివారం ఉదయం పని నిమిత్తం తన ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాల్లో నగరానికి వచ్చారు. పని ముగించుకుని ఉదయం 4.30 గంటల సమయంలో తెనాలికి వెళ్లే క్రమంలో సాయి చరణ్ తేజ్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా స్నేహితుడు రోషన్ వెనుక వైపు కూర్చున్నాడు. సత్యంగారి హోటల్ సమీపానికి రాగానే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పైనుంచి ఇద్దరూ కింద పడిపోయారు. సాయిచరణ్‌తేజ్ అక్కడికక్కడే మృతి చెందగా రోషన్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలువురికి సన్మానం



నీలాంబరం, మాధవరాజు, హేమంత్ కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పెన్షనర్స్ హాల్‌లో ప్రముఖ గాయకుడు దేవరపల్లి నీలాంబరను ఘనంగా సన్మానించారు. అనంతరం 'సంక్షేమం, అభివృద్ధి సమాంతరాలుగా ఎన్టీఆర్ పాలన' అనే అంశంపై డాక్టర్ నంబూరి మారుతీ మాధవరాజు, విధి హేమంత్‌కుమార్ ప్రసంగించారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, వెనిగళ్ళ ప్రసాద్, ధర్మారావు, కుటుంబ రావు, దేవిశెట్టి కృష్ణారావు, ఈఎల్‌వీ అప్పారావు, బెనహర్, కృష్ణ మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత ఆలయంలో శిలాఫలకం ఆవిష్కరణ

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భూరి విరాళ ప్రధాన దాత, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రంధి కాంతారావు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం 108 మంది ముత్తయిదువులకు పసుపుకుంకుమ అందించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు, కార్యదర్శి తెల్లాకుల గురుప్రసాద్, కోశాధికారి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, సాతులూరి ప్రకాశరావు, డోగిపర్తి సుజాత, మట్టుపల్లి శరణ్, ఆర్యవైశ్య ప్రముఖులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగుదనానికి ప్రతీక రంగవల్లులు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



నిర్వాహకులతో కలిసి రంగవల్లులను తిలకిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రంగవల్లులు తెలుగింటి సంప్రదాయానికి, తెలుగుదనానికి ప్రతీకని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మహిళలు అధిక సంఖ్యలో ముగ్గుల పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాంతి పండగ అంటే పెద్దల్ని స్మరించుకోవడమనీ, మన సంప్రదాయాల్ని గౌరవించుకోవటమని గుర్తుచేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ మహిళా, యువజన సంఘాలు, వాసవి సేవాదళ్ సంయుక్తంగా ఆదివారం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించాయి. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణంలో జరిగిన ఈ పోటీల్లో 137 మంది మహిళలు పోటీపడ్డారు. విజేతలకు ప్రత్యేక బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతిని ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, ప్రధాన కార్యదర్శి ఆలమూరు పూజ, కోశాధికారి గోవర్ధన్ లక్ష్మి, ఆర్యవైశ్య సంఘ కోశాధికారి వెచ్చ నాగరాజారావు, అచ్యుత సాంబ శివరావు, ఎంఎస్సార్ గుప్త, ఇ.సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం, గొడవర్తి సాయిహరేరాం, తూగుంట్ల సుబ్బారావు, ఆతుకూరి పూర్ణచంద్రరావు, కొల్లా గురునాథ గుప్త ముగ్గుల పోటీలను పర్యవేక్షించారు.

కొలనుకొండలో కార్డన్ సెర్చ్

మంగళగిరి: నగర పరిధిలోని కొలనుకొండలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల నివాస గృహాల్లో సోదాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాటలు జరుగుతాయనే అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నార్త్‌జోన్ డీఎస్పీ జె.రాంబాబు ఆధ్వర్యంలో తాడేపల్లి సీఐ శేషగిరిరావు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించి కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వేలో మొదటి స్థానం నగరానికి గర్వకారణం

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ సిటిజన్ పర్సెప్షన్ సర్వే (పౌరుల అవగాహన)లో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో, జాతీయ స్థాయిలో 6వ స్థానంలో నిలవడం గుంటూరు నగరానికి గర్వకారణమని కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో నగరానికి మంచి ర్యాంక్ రావడం ద్వారా నగరంలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. సర్వేపై నగర ప్రజలకు అవగాహన కలిగించి, దేశస్థాయిలో అత్యుత్తమ స్థానంలో నిలిచేలా నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు టీం వర్క్‌తో కృషి చేశారని కొనియాడారు. సర్వే ద్వారా నగర అభివృద్ధి, మౌలిక వసతులపై నగర ప్రజల అభిప్రాయాలు కూడా తెలుసుకోవడానికి నేరుగా అవకాశం కలిగిందని కమిషనర్ పేర్కొన్నారు. సర్వేలో భాగస్వాములైన నగర ప్రజలు, సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జీజీహెచ్‌లో అన్నదానం

గుంటూరు మెడికల్: ఆల్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ విజయవాడ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జీజీహెచ్‌లో అన్నదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పి. నారయ్య, ప్రెసిడెంట్ షేక్ గౌస్, ది న్యూ భారతి ఎక్సరే అండ్ ల్యాబ్ గుంటూరు అధినేత యు. నాగభూషణం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నగరంపాలెం: పొన్నూరు రోడ్డులోని చంద్రబాబు కాలనీలో జీఎస్ క్లినిక్ అండ్ ల్యాబ్, నవాజ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరంతో, ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్న రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ డైరెక్టర్ బషీరున్నీసా, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు కూడా స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై అక్కడ కూడా నేరుగా ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.